నీలకంఠాయ.. నమో నమః


యలమంచిలి కొత్తపేట పురాతన శివాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో మూడో సోమవారం పూజలు

యలమంచిలి రూరల్: కార్తీక మాసం మూడో సోమవారం యలమంచిలి పట్టణం, మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో వేకువజాము నుంచే అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కొత్తపేట ఉమాధర్మలింగేశ్వర స్వామి, ప్రధాన రహదారి పక్కనున్న కాశీవిశ్వేశ్వర త్రిమూర్తులు స్వామి, బైపాస్ రోడ్డు సోమస్కంధమూర్తి, శేషుగెడ్డ శివాలయాల్లో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

మునగపాక: నాగులాపల్లిలోని పార్వతీ సాంబమూర్తులను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మునగపాక లింగరాయిగుడి, వాడ్రాపల్లి దక్షిణేశ్వరుని ఆలయాలను దర్శించుకునేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. టి.సిరసపల్లిలోని వీరభద్ర స్వామిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ దర్శించుకొని పూజలు నిర్వహించారు.


నాగులాపల్లిలో పార్వతీ సాంబమూర్తులను దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి(యలమంచిలి): పంచదార్ల ఉమాధర్మలింగేశ్వర స్వామి క్షేత్రం కార్తీక మాసం మూడో సోమవారం పూజలతో కళకళలాడింది. ముందుగా కొండ దిగువన ఉన్న రాధామాధవ స్వామి ఆలయం వద్ద ఉన్న పుణ్యధారల్లో స్నానమాచరించి కొండ మీద ఉమాధర్మలింగేశ్వర స్వామిని భక్తుఉల దర్శించుకున్నారు. పుణ్యధారల్లో స్నానాలు చేసేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ఈవో సాంబశివరావు, ఆలయ కమిటీ చైర్మన్ సుందరపు లోవరాజు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.


పంచదార్ల ఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయంలో పుణ్యధారల్లో కార్తీక స్నానాల కోసం బారులు తీరిన భక్తులు

కోటవురట్ల: కార్తీకమాసం మూడో సోమవారాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వరాహ, సర్పా నదుల్లో పుణ్య స్నానాలు ఆచరించి స్థానిక శివాలయాలలో క్షీరాభిషేకాలు జరిపారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం


రూ.లక్ష విరాళం అందజేస్తున్న డాక్టర్ మురళి

మునగపాక: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి అనకాపల్లికి చెందిన లండన్ ఆస్పత్రి వైద్య నిపుణుడు ఆడారి మురళి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆడారి గంగమహేష్, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, ఆడారి రమణబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంతో అభివృద్ధి పనులు

మునగపాక: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టవచ్చని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాక గ్రామాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సహకరించాలన్నారు. జనసేన మండల అధ్యక్షుడు టక్కిలి పరశురామ్, ఏపీవో శివ, ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నింటా రాణించాలి

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ కోరారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ ఉత్సవాల ముగింపులో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ఆయన ఆదివారం రాత్రి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు.

కొండకర్లలో ధర్మ రక్షా దినోత్సవం

అచ్యుతాపురం: కొండకర్ల రామాలయంలో సోమవారం ధర్మ రక్షా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ మాట్లాడుతూ ఎందరో మహనీయుల కృషి ఫలితమే సనాతన ధర్మం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, ఆడారి త్రినాథ్, కట్టమూరి శ్రీనివాసరావు, శరగడం పరశురాం, భాను ప్రకాశ్ పాల్గొన్నారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య పనులు


కె.వెంకటాపుంలో చెత్తను సేకరిస్తున్న కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. కార్మికులు వీధుల్లోని చెత్తను సేకరించి శుభ్రపరిచారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ పారిశుధ్య మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా నిల్వ చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు


కొత్తపేట హైస్కూల్‌లో వ్యాసం రాస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, కొక్కిరాపల్లి అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం, రైల్వేస్టేషన్ రోడ్డు ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా ప్రతిభ కనబరిచారు. గ్రంథాలయాల అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీలను స్థానిక గ్రంథాలయాధికారి వి.ఆనంద్, హెచ్ఎంలు రమణ, భవానీ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మాయాదేవి పర్యవేక్షించారు.

అచ్యుతాపురం: అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీ విద్యా నికేతన్‌కు చెందిన డి.రాజు, అచ్యుతా విద్యా సంస్థలకు చెందిన ప్రసాద్, పల్లి శివ కృష్ణలు గ్రంథాలయాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో..

పాయకరావుపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా భగవద్గీత శ్లోకాలు పోటీలు నిర్వహించారు. పాయకరావుపేట పాఠశాలల విద్యార్థులు పాల్గొని శ్లోకాలు ఆలపించారు. ఈ పోటీలకు జడ్జీలుగా ఎస్‌టీ సీతారామమూర్తి, వై.అచ్యుతరావు వ్యవహరించారు. అలాగే యోగాసనాల పోటీల్లో పలువురు విద్యార్థులు సత్తా చాటారు.

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని సొంతం చేసుకోవాలన్నారు.

మునగపాక: వారోత్సవాల్లో భాగంగా సోమవారం మునగపాక, గణపర్తి శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మునగపాక శాఖా గ్రంథాలయాధికారి రమణ గ్రంథాలయాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గణపర్తిలో గ్రంథాలయాధికారి అప్పలనసరమ్మ వ్యాస రచన పోటీలు నిర్వహించారు.


పాయకరావుపేటలో విద్యార్థుల యోగాసనాలు


కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు


మునగపాక శాఖా గ్రంథాలయంలో క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆధ్యాత్మిక భావనతో సన్మార్గం


పాములవాకలో అయ్యప్ప స్వామిమాలధారులతో మాజీ ఎమ్మెల్యే జోగులు

కోటవురట్ల: పల్లెల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఐక్యతను చాటుతాయని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పాములవాకలో కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, గ్రామస్తులు, స్వామి మాలధారులు ఉన్నారు.

కలశాలతో భారీ ఊరేగింపు

పాయకరావుపేట: పాత సత్యవనం గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములతో 60 కలశాలతో భారీ ఊరేగింపు చేపట్టారు. సత్యవరం, మాసాహేబుపేట గ్రామాలకు చెందిన స్వాములు భక్తి గీతాలు, భజనాలతో రెండు గ్రామాల్లో ఊరేగింపు చేసారు. భక్తులు ఊరేగింపుతో రెండు గ్రామాలలోను ఆధ్మాత్మిక శోభ వెల్లువెత్తింది.

ముగిసిన సప్తాహ హరిభజన

ఎస్.రాయవరం: వమ్మవరం శ్రీస్వయంభూ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సప్తాహ హరిభజన సోమవారం ముగిసింది. తెల్లవారుజామున హారతి ఇచ్చి హరిభజన ముగించారు. ఆలయంలో వారం రోజుల క్రితం ప్రారంభించిన సప్తాహంలో పలువురు మహిళా భజన బృందాలు నిర్విరామంగా హరిభజనలు చేసి భక్తి గీతాలు ఆలపించారు.

సేంద్రియ ఉత్పత్తులకు ప్రోత్సాహం అవసరం

యలమంచిలి రూరల్: ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని యలమంచిలి తహసీల్దార్ కె.వరహాలు కోరారు. సోమవారం యలమంచిలి మండలంలోని పలు గ్రామాల్లో ప్రకతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ప్రారంభించారు. ప్రస్తుత కాలంలో లాభార్జనే ధ్యేయంగా రసాయన ఎరువులతో పండిన వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లలో తక్కువ ధరకు అందుబాటులో ఉంచుతున్నారన్నారు. వీటిని తినడం వల్ల అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సేంద్రియ ఎరువులతో రైతులు పండించిన కూరగాయాలనే కొనుగోలు చేయాలని సూచించారు.


సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ వరహాలు

మహారాజశ్రీ యలమంచిలి సీనియర్ సివిల్ డివిజన్ జడ్జి వారి కోర్టులో

E.P.No. 262/2017 O.S. No. 208/2015

Between:
అంగిన కుమారి .. DHR
And
బళ్ళ రాము మరియొకరు .. JDRs

వేలం ప్రకటన

యిందలి DHR కి JDRs వద్ద నుండి రావలసిన ఈ అమలు బాకీ దస్కీలా వడ్డీ వగైరాలు వసూలు నిమిత్తం యిందలి JDRs కి ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై సంపూర్ణ హక్కు అనుభవం స్వాధీనం గల స్థిరాస్తిని తే. 06-12-2024దిన బహిరంగ వేలం వేయుటకు పై కోర్టు వారు నిశ్చయించినారు. సదరు ఆస్తిని వేలంలో పాడుకోదలచినవారు పై కోర్టులో **తే 06-12-2024దిన ఉదయం గం॥ 10-30ని॥** లగాయితు సాయంత్రం గం॥ 5.00లోపు హాజరు అయి వేలంలో పాల్గొని ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలంలో పాడుకొనవచ్చును.

అస్తి వివరం:

విశాఖపట్నం జిల్లా ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, యలమంచిలి సబ్-రిజిస్ట్రారు ఎస్.రాయవరం మండలం, ఎస్.రాయవరం గ్రామం, పేపకాయల వీధి, సర్వే నెం. 83/1, డోర్ నెం. 3-13-3, అసెస్‌మెంటు నెం. 1215 గల RCC స్లాబ్ యింటికి హద్దులు: **తూర్పు:** మడగల నారాయణమూర్తి ఇల్లు **దక్షిణం:** మడగల రమణ ఖాళీ స్థలం **పడమర:** దారి, దారిఅవల వైబోయిన సత్తిబాబు యిల్లు. **ఉత్తరం:** కీర్తి ఈశ్వరరావు ఖాళీ స్థలం

DHR Value Rs. 3,00,000/-
Field Officer Value Rs. 5,00,000/-
Market Value Rs. 8,24,680/-

NB: పై తెలియజేయబడిన ఆస్తిపై తేది. 13-5-2014దిన గల రిజిష్టరు తనఖా బాకీ లోబడి మరియు యిందలి JDRకి గల 2/3 వంతు హక్కుకి లోబడి వేలం వేయబడును.

// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు//

Dodda Nageswara Rao
DHR తరపు అడ్వకేట్,
యలమంచిలి, సెల్: 8247879186

యలమంచిలి,
తే. 18-11-2024

బిల్డర్స్ డే శుభాకాంక్షలు

- Advt Feature

సెజ్ రాకతో ప్రగతి పరుగులు

అచ్యుతాపురం: రెండు దశాబ్దాలుగా అచ్యుతాపురం సెజ్ కేంద్రంగా అభివృద్ధి పరుగులు తీస్తోంది. దక్షిణ భారతదేశంలో కీలకమైన వాణిజ్య కేంద్రంగా అవతరిస్తోంది. తలసరి ఆదాయంలోనూ అన్ని ప్రాంతాలతోనూ పోటీ పడుతోంది. మత్స్యకార సంపద, వ్యవసాయ పంటలపై అంతంత మాత్రం ఆధారపడిన అచ్యుతాపురం రూపురేఖలు ఒక్కసారిగా మారిపోయాయి. అచ్యుతాపురంలో సెజ్ ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి బాట పట్టింది. గ్లోబల్ స్థాయిలో కార్పొరేట్ కంపెనీలు వాటి కార్యకలాపాలు నిర్వహించడంతో ఆయా కంపెనీ ఉత్పత్తుల రాకపోకలు, వేలాది మంది కార్మికులకు ఉపాధి కారణంగా రియల్ ఎస్టేట్‌కు సైతం ఈ ప్రాంతం అత్యంత కీలకంగా మారింది. అనేక ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలు వెంచర్లు వేసి కస్టమర్లను ఆకర్షిస్తున్నాయి. కార్పొరేట్ హంగులతో కూడిన నిర్మాణాలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా స్థానిక సంస్థలు కృషి చేస్తుండడంతో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టేందుకు బిల్డర్లు ముందుకు వస్తున్నారు. గ్రామీణ తరహా ఛాయలు ఉన్నా పట్టణీకరణ దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి.

కేజీబీవీలో బోరు ప్రారంభం

ఎస్.రాయవరం: తిమ్మాపురం కేజీబీవీలో నాసా సంస్థ సహకారంతో చేతి బోరు ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ కర్రి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బోరును అమెరికా నుంచి వచ్చిన వైజర్ సోమవారం ప్రారంభించారు. ఆయనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి కేజీబీవీ, చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో న్యూలైఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బోర్లను ఏర్పాటు చేశారు. వీటిని న్యూలైఫ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ రాజా కొలపాటి, వెల్ఫేర్ డైరెక్టర్ మైకి వైజర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీ తోట సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.


కేజీబీవీలో బోరును ప్రారంభిస్తున్న వైజర్

ఘనంగా శూలాల మహోత్సవం ప్రారంభం

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో సోమవారం పార్వతీ సాంబమూర్తుల శూలాల మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి పార్వతీ సాంబమూర్తులను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉత్సవంలో భాగంగా సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు నాలుక, బుగ్గలపై ఇనుప చువ్వలు గుచ్చుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శూలాలు ధరించిన భక్తులు ఆలయ ప్రాంగణంలో డప్పు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేసి ఆకట్టుకున్నారు.


శూలాలు ధరించిన భక్తులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సేఫ్ జర్నీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

యలమంచిలి రూరల్: రహదారి భద్రతపై యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐ బి.రామకృష్ణ స్థానిక కొక్కిరాపల్లి హైవే జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం అవగాహన కల్పించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని ఎస్ఐ చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పాయకరావుపేట: 'సేఫ్ ఇండియా'పేరిట శ్రీచైతన్య విద్యా సంస్థ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట ట్రాఫిక్ సిబ్బంది మాట్లాడుతూ సేఫ్ జర్నీకి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు. వై జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం సురేష్, ఆర్ఐ గోపీనాథ్, ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

యలమంచిలి రూరల్: ధర్మవరం మెప్మా కార్యాలయంలో సోమవారం పలు పథకాలపై అవగాహన కల్పించారు. మెప్మా పీడీ సరోజిని ముఖ్య అతిథిగా హాజరై పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి బీమా యోజన, పీఎం శ్రమ యోగి మాన్‌ధన్ యోజన, పీఎం జనధన్ యోజన, వన్ నేషన్-వన్ రేషన్ కార్డు, పీఎం జనని సురక్ష యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల్లో సభ్యులుగా నమోదు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.